# అందం

- బిట్టిపెద్ది ఉమ

"ఒసేయ్ అర్చనా...కాస్త ఇలా వచ్చి ఊరగాయ జాడీని అటకమీద నుంచి దించవే. రాత్రికి ఊరగాయ ముక్క లేదు" పర్వతమ్మ నాలుగో సారి కూతుర్ని పిలిచింది. అర్చన ఈ లోకంలో ఉంటేగా వినిపించడానికి. 'మనసైన ప్రియుడు' నవలలో నిండా మునిగిపోయింది. పుస్తకం పూర్తయ్యేవరకూ ఎంత పిలిచినా లాభంలేదని గ్రహించిన పర్వతమ్మ సణుక్కుంటూనే ఓ కుర్చీని లాక్కుని వచ్చింది తనే జాడీని దింపుదామని.

కుర్చీమీద అడుగు పెడుతూనే కుర్చీ లోపమో, పర్వతమ్మ భారీకాయమో కానీ కుర్చీ బోర్లా పడింది. పర్వతమ్మ కాలు మడతపడింది. చూస్తుండగానే పర్వతమ్మ కాలు మెల్లగా వాచిపోయింది. భరించలేని నొప్పి మొదలయింది. అర్చనకింక పుస్తకం మూయక తప్పలేదు.

ఫ్రాక్చర్ కాలేదుగానీ క్రేప్ బాండ్ కట్టి మూడు వారాలు రెస్ట్ తీసుకొమ్మని చెప్పి పంపాడు డాక్టర్. నాలుగు రోజులు నాలుగు యుగాలుగా గడిచాయి.

అర్చనా, భావన నువ్వంటే నువ్వు అనుకుంటూ అన్ని పనులూ సగం సగం చేయడంతో ఇల్లు నరకంలా తయారయింది.

"ఒరేయ్ అప్పూ నువ్వెళ్లి కోడల్ని తీసుకు రారా" పర్వతమ్మ విసుగెత్తిపోయి అయిదోరోజు అప్పారావుకి పురమాయించింది.

"కోడలా...కోడలెవరు?" అప్పారావు ఆశ్చర్యపోతూ అడిగాడు.

"కోడలెవరో తెలియదా. కోడలంటే నీ పెళ్లాం. రేపుమొదటి బస్సుకి రామాపురం వెళ్లి మైథిలిని తీసుకురా"

"కట్నం పూర్తిగా ఇచ్చేవరకూ అది నీ పెళ్లాం కాదు, నువ్వు దాని మొగుడుకాదు, అది నా కోడలుకాదు అని పెళ్లిపీటల మీదనుంచి తీసుకువచ్చావుకదే" అప్పారావు అమాయకంగా మొహం పెట్టి అడిగాడు.

పర్వతమ్మకి ఒళ్లు మండిపోయింది.

"తాళి కట్టావుగా. తర్వాత సంగతి తర్వాత. ముందు దాన్ని తీసుకురా. ఇంకా రెండువారాలు నేను లేవడానికిలేదు. ఇప్పుడే ఇల్లు నరకమైపోయింది"

'అసలు సంగతి అదీ' అప్పారావు మనసులోనే అనుకున్నాడు.

* * *

అప్పారావు పెళ్లి మైథిలితో అయి అయిదు నెలలు దాటినా పర్వతమ్మ కోడల్ని ఇంకా తీసుకు రాలేదు. కట్నం డబ్బు పూర్తిగా ఇస్తేగానీ ఇంటి గడప తొక్కవద్దని మైథిలి తండ్రి బుల్లిరాయుడుగారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. కూతురికి ఎలాగైనా పెళ్లి చేసెయ్యాలన్న తపనతో బుల్లిరాయుడు గారు పర్వతమ్మ చెప్పినదానికల్లా, అడిగినదానికల్లా తలూపాడుగానీ ఆయనకి అంత స్థోమత లేదు. ఆఖరికి కట్నం డబ్బు ఓ ఇరవైవేలు తక్కువ పడింది. పెళ్లయ్యాక చల్లగా ఇంక ఇవ్వలేనని చేతులెత్తేసాడు.

పర్వతమ్మ అగ్గిమీద గుగ్గిలమై పెళ్లి తంతు అవుతూనే అప్పారావుని లాక్కు వచ్చేసింది. పెళ్లి అర్థాంతరంగా ముగిసినందుకు అప్పారావు అట్టే బాధపడలేదు.

చీకటిలో నుంచుంటే మనిషి ఉన్న జాడ కూడా లేకుండా నలుపులో నలుపుగా కలిసిపోతుంది మైథిలి. అంత చిక్కటి రంగు మైథిలిది. తారు డబ్బా, దానికితోడు పిప్పళ్ల బస్తాలా లావు. బుల్లిరాయుడుగారు ఎలాగైనా కూతురికి పెళ్లి చేసెయ్యాలని పర్వతమ్మ గొంతెమ్మ కోర్కెలకి తలాడిస్తే అప్పారావు అమ్మ మాట కాదంటే ఈ జన్మలో పెళ్లేకాదు అన్న విరక్తితో తల ఊపాడు.

"పిల్ల కాస్త నలుపు. అయితేనేం మొహంలో కళ ఉంది. కాస్త ఒళ్ళుగా వుంటుంది. అయితేనేం ఆ జడ నిగనిగలాడుతూ జెర్రిగొడ్డులా అంత లావున మోకాళ్లదాకా ఉంది. ఈ రోజుల్లో అమ్మాయిలకి జుట్టే ఉండడంలేదు. కళ్ళు కలువరేకుల్లా వెడల్పుగా చెంపల చివర్లనంటుకుంటున్నాయి. సంసారపక్షం. పిల్లకేం" పర్వతమ్మ అన్ని ప్లస్ పాయింట్లు చూపించాక ఆఖరికి అప్పారావుకి కూడా మైథిలి బాగానే ఉందనిపించింది.

* * *

నలుగురు ఆడపిల్లల మధ్య ఒక్కడే కొడుకు పర్వతమ్మ, సీతారామయ్యలకి. అందుకే అందరి ఆశలూ అప్పారావు మీదే. అప్పారావుకి ఇద్దరు అక్కలు, ఇద్దరు చెల్లెళ్ళు. అప్పారావు పెళ్లి ద్వారా ఘనంగా ఆడబడుచు కట్నాలు రాబట్టుకోవాలని అక్కలూ, చెల్లెళ్ళు ఆశపడితే ఒక్కగానొక్క కొడుకు కాబట్టి వీలైనంత ఎక్కువ కట్నం గుంజాలన్నది పర్వతమ్మ కోరిక.

సీతారామయ్య మాటకి ఇంట్లో విలువలేదు కాబట్టి ఆయన మనసేంటో ఎవరికీ తెలియదు. అందరి కోరికలూ తీర్చే సంబంధం ఒక్కటీ రాకపోవడంతో అరడజను ఏళ్లుగా ఏడాదికి పది సంబంధాలు చొప్పున చూసినా అప్పారావుకి పెళ్లి ఘడియలు రాలేదు.

పుచ్చుకునే వాళ్లకు కోరికలు ఉన్నప్పుడు ఇచ్చేవాళ్లకి కోరికలుంటాయిగా. పోస్టాఫీసులో గుమస్తా ఉద్యోగం చేస్తున్న అప్పారావు అందగాడైనా అంత ధర పలకడని కొన్ని బేరాలు వెనక్కు వెళితే, ఎదుగుబొదుగులేే ఉద్యోగం అని కొన్ని సంబంధాలు వెనక్కి వెళ్లిపోయాయి.

"మీరే వెళ్లి చూసిరండి. నాకు సెలవులేదు" అప్పారావు పాతికమంది అమ్మాయిల్ని చూసాక విసుగెత్తిపోయి అన్నాడు. 'ఎలాగూ తన అభిప్రాయం రెండో ప్రిఫరెన్సే'

"నువ్వు లేకుండా ఎలారా అప్పయ్యా. అయినా నాలుగుసార్లు పిల్లని చూస్తామనడం ఏం బావుంటుంది?" పర్వతమ్మ సాగదీసింది.

అసలు సంగతి ఏమిటంటే అప్పారావు లేకుండా కూడా కొన్ని సంబంధాలు చూసి వచ్చారు పర్వతమ్మ, ఆవిడ కూతుళ్ళు. కానీ ఆ పెళ్లిచూపుల తీరు కాస్త తేడాగానే ఉంది. పెళ్లికొడుకులేని పెళ్లిచూపులు అంటే స్వీట్లు, హాట్లు మర్యాదలు ఏదో పేరుకే అన్నట్లు ఉండేవి. 'కాఫీ తాగుతారా' అని నాలుగుసార్లు అడిగి మరీ మొహమాటానికి పోకుండా 'తాగుతాం...కతికితే అతకదు లాంటి చాదస్తాలు మాకులేవు' అంటే అప్పుడు తప్పదన్నట్లు నీళ్ల టీయో, కాఫీయో వచ్చేది.

అందుకే అప్పారావు లేకుండా పెళ్లిచూపులకు


వెళ్లకూడదన్న నిర్ణయానికి వచ్చారు పర్వతమ్మా అండ్ కో. అప్పారావు పెళ్లిచూపుల కథలు వాళ్ల ఊరికి ఇటో యాభైమైళ్ళు, అటో యాభైమైళ్ళు వ్యాపించడంతో దగ్గర ఊళ్లో వాళ్లెవ్వరూ వాళ్ల ఇంటి గుమ్మం తొక్కడం మానేసారు.

'బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా' సామెత ఎవరైనా గుర్తు చేయబోతే గయ్యిమనేది పర్వతమ్మ.

"మొన్ననేగా పాతిక నిండాయి. మగవాడికి అదో వయసా. అయినా పూర్వాషాఢ వాళ్లకి కాస్త ఆలస్యం అవుతుందని గుళ్ళో శాస్త్రులుగారు అన్నారు" అప్పారావు వయస్సును అయిదేళ్ళు తగ్గించేసింది పర్వతమ్మ.

ఆఖరికి అనుకున్నంత కట్నం, కోరుకున్న ఆడబడుచు లాంఛనాలు ఇస్తామన్న బుల్లిరాయుడుగారి సంబంధం ఖాయం చేసుకున్నారు.

అప్పారావు 'అమ్మాయి అంత బావుండలేదు'అని అనబోయి 'ఏదో ఒకటి అసలు పెళ్లంటూ అవుతోంది అదే చాలు' అని నోరు మూసుకున్నాడు.



★ ★ ★

మర్నాడు అప్పారావు మొదటి బస్సుకి వెళ్లేవరకు పర్వతమ్మ కోడలు కోడలు అని పలవరిస్తూనే వుంది.

అప్పారావు రామాపురం అత్తగారింట్లో అడుగు పెట్టగానే ఆ ఇంట్లో కొత్త ఉత్సాహం, సంతోషం వెల్లి విరిసాయి. బుల్లిరాయుడుగారు అల్లుడిని ఆప్యాయంగా పలకరించి మర్యాదలు చేసాడు. బావమరుదులు, మరదళ్ళు 'బావా...బావా' అంటూ అప్పారావు చుట్టూ తిరిగారు. బుల్లిరాయుడుగారికి మైథిలి పెద్దమ్మాయి. ఆ తరువాత ముగ్గురు అబ్బాయిలు, ఇంకో ఇద్దరు అమ్మాయిలు. పద్నాలుగేళ్ళ వయసులో తల్లి పోవడంతో మైథిలి తమ్ముళ్లనీ, చెల్లెళ్లనీ పెంచింది. మైథిలి వాళ్లకి ఓరకంగా అమ్మే.

ఇంట్లో చాకిరీ కోసమైనా మైథిలిని తీసుకువెళ్తాననడంతో అందరిలో ఆనందం పొంగింది. చిన్నాచితకా ఉద్యోగాలు చేస్తున్న ఇద్దరు బావమరుదులు కట్నం డబ్బు త్వరలో ఇస్తామని ప్రామిస్ చేసారు. రాచమర్యాదలు అంటే ఏమిటో అర్థమయింది అప్పారావుకి. అలాగే ఆప్యాయత అన్న పదానికి నిర్వచనమూ తెలిసింది. 'ఒక్కరోజైనా ఉండాల్సిందే' అని అందరూ పట్టుబట్టడంతో అప్పారావు అత్తగారింటి సుఖాన్ని ఆస్వాదించి మర్నాడు మైథిలిని తీసుకుని ఇంటికివచ్చాడు.

ఇంటికివస్తూనే పనిలో జొరబడింది మైథిలి. ఇంట్లో అడుగు పెట్టగానే పమిటకొంగు నడుం చుట్టూ బిగించి పరపరా పనిచేయడం మొదలుపెట్టిన మైథిలిని చూడగానే అందరి ప్రాణాలు కుదుటబడ్డాయి.

మొదట్లో ఇంట్లో దొర్లుతున్న తారుడబ్బాలా కనిపించినా బొంగరంలా తిరుగుతూ అందరికీ అన్నీ అమరుస్తున్న మైథిలి అందరికీ తలలో నాలుక అయింది.


## అగ్ని పట్టణం

జర్మనీలోని నార్డ్లింగన్ అనే పట్టణం విరియస్‌క్రేటర్ అనే అగ్నిపర్వత బిలం మధ్యలో ఆవిర్భవించింది. సుమారు 2560 అడుగుల వెడల్పు వున్న ఈ బిలం దాదాపుగా కోటిన్నర సంవత్సరాల క్రితమే ఉల్కాపాతం వల్ల ఏర్పడిందని శాస్త్రజ్ఞుల అంచనా. ఈ నగరంలోని భవనాలన్నీ బూడిద రంగు, నీలంరంగు కలిసిన సువైట్ అనే రాళ్లతో నిర్మించడం జరిగింది. ప్రపంచంలో మరెక్కడా ఈ రాయి దొరకదు. తామొక అగ్నిపర్వతం బిలం లోపల నివశిస్తున్నామనే విషయం నార్డ్లింగన్ ప్రజలకు ఇటీవలే తెలిసింది. ఇదొక శిలాబిలమని, ప్రమాదకారి కాదని ఈ ప్రదేశాన్ని పరిశీలించిన అమెరికన్ శాస్త్రవేత్తల బృందం పేర్కొన్నారు.

## యుద్ధ నౌక

క్రోనాన్ అనబడే స్వీడన్ దేశానికి చెందిన నౌక 17వ శతాబ్దం నాటిది. దీనికున్న ఘన చరిత్ర కూడా ఘనంగానే వుంటుంది. 17వ శతాబ్దంలో 842మంది సైనికులతోనూ, 128 ఫిరంగులతోనూ హాలెండ్‌పైకి యుద్ధానికి బయలుదేరిన ఈ నౌక మార్గమధ్యంలో పెనుతుఫానుకు గురై సముద్రంలో మునిగిపోయింది. మూడువందల సంవత్సరాల తరువాత 1980లో ఆండ్రీస్ ట్రాన్సన్ అనే పరిశోధకుడి పరిశోధనలో ఈ నౌక బయటపడింది. అందులోని ఫిరంగులు చెడిపోకుండా ఇప్పటికీ ఉపయోగించడానికి వీలుగా ఉన్నాయని నిపుణుల అధ్యయనంలో తేలింది.

-పి.వి.రమణకుమార్




పర్వతమ్మకి కావాల్సినవన్నీ చూసుకోవడంతోపాటు ఆడబడుచులకి కాలేజీ టైముకి అన్నీ అమర్చి పెట్టేది. భావనా, అర్చనా 'వదినా...వదినా' అటూ మైథిలి చుట్టూ తిరిగి నైస్‌గా ఆఖరికి తమ డ్రెస్సులు ఇస్త్రీ చేయించుకోవడం మొదలుపెట్టారు.

రెండురోజుల్లో ఇంటి స్వరూపాన్నే మార్చేసింది మైథిలి. మూలమూలల నుంచి ఇంటిని శుభ్రం చేసి ఇంట్లో వస్తువులన్నీ ఓ పద్ధతిలో సర్ది ఇల్లు కళకళలాడేటట్లు చేసింది.

ఇంట్లోనేకాదు, ఇంటి బయట స్వరూపమూ మార్చేసింది. ఇంటిముందున్న స్థలం వెనుక ఉన్న పెరడూ అన్నీ శుభ్రం చేసి మొక్కలన్నీ ఓ క్రమంలో సర్దింది. పాదులు కట్టి గొప్పులు తవ్వింది. పండుటాకులు, చెత్తాచెదారంతో చీదరగా ఉండే పెరడు కొత్త కళని సంతరించుకుంది. పూటపూటా రుచిగా కంచంలో పడుతున్న పదార్థాలు భోజన ప్రియుడైన అప్పారావు మనసును దోచేసాయి.

సీతారామయ్యగారికైతే కోడలు ప్రాణమయిపోయింది. ఇల్లు తీర్చిదిద్ది, రుచిగా వండి పెట్టే కోడలు మైథిలి అంటే ప్రత్యేకమైన అభిమానం, ప్రేమా ఆయనకి. 'తినగ...తినగ' అన్నట్లు చూడగా చూడగా మైథిలి మొహంలో నిజంగానే కళ కనిపిస్తోంది అప్పారావుకి. చిన్న చిరునవ్వుకే లోతుగా సొట్టలు పడే బుగ్గలు, తాచుపాములా లయబద్ధంగా ఊగే జడా, గుండ్రటి మొహం, చక్కని పలువరుస, కాస్త లావు అయినా, కాస్తనలుపు అయినా మైథిలి చక్కటి పిల్లే.

ముఖ్యంగా తెల్లగా తళతళలాడుతూ కాంతులీనే కళ్ళు మరీ బాగుంటాయి అనుకున్నాడు అప్పారావు.

"ఒరేయ్..ఏదో తప్పక ఇంట్లో జరగక దాన్ని పిలిపించాల్సి వచ్చింది. కానీ దాని మాయలో పడకు. రేపు ఇంకో నెల ఆగితే మీ చిన్నక్క పురిటికి వస్తుంది. ఇంట్లో చచ్చేంత చాకిరీ. కొన్నాళ్లుంచుకుని పంపిద్దాం. ఎలాగూ కట్నం వంక ఉందిగా. మంచి అందమైన అమ్మాయిని చూసి నీకు మళ్లీ పెళ్లి చేస్తాను'' పర్వతమ్మ, అప్పారావుని మైథిలిని తీసుకురావడానికి ముందే హెచ్చరించింది.

* * *

"ఏమిటే పర్వతం! ఈ పిల్లా నీ కోడలు? పెళ్లిచూపులకెళ్లి కళ్ళు మూసుకున్నారేమిటి ఇంట్లో అందరూ'' పర్వతమ్మకి అక్క వరసైన భానుమతి ఓ రోజు వాళ్లింటికి వచ్చి బుగ్గలు నొక్కుకుంది.

"ఏం చెప్పమంటావక్కా. మోసం చేసారు. అంతా మా ఖర్మ. దీని చెల్లెల్ని చూపించి ఊఁ అన్నాక పెళ్లిలో దీన్ని కూర్చోబెట్టారు'' పర్వతమ్మ నమ్మకంగా కథ అల్లి కళ్ళు ఒత్తుకుంది.

అప్పారావు తల్లి మాటలు విని నిర్ఘాంతపోయాడు. తనూ విన్నా మైథిలి చిరునవ్వుతో కాఫీ, టిఫిన్ ఇద్దరికీ అందించి నోరు మూసుకుని ఉండిపోవడం మరింత విస్మపోయేలా చేసింది.

"ఏం మనిషి...ఇంకోళ్లయితే అక్కడికక్కడే అత్తగారనైనా చూడకుండా ఏకెయ్యదూ'' అప్పారావుకి మైథిలిని చూస్తే జాలేసింది, ఆశ్చర్యమనిపించింది.

మైథిలి అని సీతమ్మవారి పేరు పెట్టుకున్నందుకు ఆ అమ్మకున్నంత ఓర్పు ఉందనిపించింది.

మైథిలి వచ్చి నాలుగునెలలపైనే అయింది. అప్పుడప్పుడు మైథిలితో మాట్లాడక తప్పడంలేదు అప్పారావుకి.

"నీకు కోపం రాదా? మా అమ్మ నీ మీద అంత పెద్ద అభాండం వేసింది. అమ్మ గుట్టు రట్టు చేస్తావనుకున్నాను'' ఆ సాయంత్రం మొక్కలకి నీళ్ళు పెడుతుంటే అక్కడికి వెళ్లి అప్పారావు మెల్లగా అడిగాడు.

"దానివల్ల ఒరిగేదేముంది?'' మైథిలి తల వంచుకునే జవాబిచ్చింది.

"ఈ ఇంట్లో అందరూ నిన్ను అవసరానికే వాడుకుంటున్నారు. వీళ్లకి నువ్వు నమ్మకమైన పనిమనిషి, వంటమనిషి. ఈ ఇంటి కోడలివని ఎవరూ అనుకోవడంలేదు. బహుశా ఆ స్థానం నీకు ఎప్పటికీ దక్కదేమో. మా అమ్మ నాకు మళ్లీ పెళ్లి చేస్తానని నీముందే అంటోంది. నీకు కోపం రాదా? రోషం లేదా?"

"ఆవిడని తప్పుపట్టడం ఎందుకు? అత్తయ్య అనేది సబబే. మీకు నేను తగను. అయినా మనమధ్య ఏం సంబంధం ఉందని బాధపడను" మైథిలి మెల్లగా అన్నా ఆ మాటలు ములుకుల్లా అప్పారావు గుండెని గుచ్చుకున్నాయి.

ఆ రాత్రంతా అప్పారావుకి నిద్రపట్టలేదు.

పక్కమీద దొర్లుతూనే వున్నాడు. మైథిలి మంచితనం, అణకువ అప్పారావుని వివశుడిని చేస్తున్నాయి. సొట్టలుపడే బుగ్గలు, పల్చటి పెదాలు, అయస్కాంతంలా ఆకర్షించే కళ్ళు, పిరుదులమీద నాట్యంచేసే జడా.. మైథిలికి తాళి కట్టి తనేం చేసాడు? పెళ్లికి ముందు, ఆ తరువాత కూడా తను ప్రవర్తించిన తీరు సిగ్గుచేటు. అమ్మ ఎక్కువ కట్నం కోసం ఇంకో పెళ్లి చేస్తానంటుంటే గొర్రెలా తలాడిస్తున్నాడు.

'మన బంగారం మంచిదైతే' మైథిలి ఎంత సున్నితంగా తెలియజెప్పింది ఆ సంగతి. 'అయినా మనమధ్య ఏం సంబంధం ఉందని బాధపడాలి' మైథిలి మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

తల్లిని తప్పుబడ్తున్న తను అమ్మకంటే పెద్ద తప్పు చేసాడు. మైథిలి పెద్ద అందగత్తె కాకపోవచ్చు.

ఆ సంగతి తను ముందే ఎందుకు తెగేసి చెప్పలేకపోయాడు. పెళ్లి చేసుకున్న తను మైథిలిపట్ల ప్రవర్తిస్తున్న తీరు తప్పు. పెళ్లికి సన్నగా ఉన్న అమ్మాయిలు ఎంతమంది పెళ్లి తరువాత పిప్పళ్ల బస్తాల్లా తయారు కావడంలేదు. వాళ్లని భర్తలు వదిలెయ్యరేం?

అందగత్తె అని ఏరికోరి ఇందిరని పెళ్లి చేసుకున్న చంద్రమోహన్ ఏం సుఖపడుతున్నాడు?

పెళ్లయిన రెండేళ్లకి భర్తనీ, బిడ్డనీ కూడా వదిలేసి వెళ్లిపోయింది ఇందిర. చంద్రమోహన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు అవమానం భరించలేక. రాత్రంతా ఆలోచిస్తూనే పడుకున్న అప్పారావుకి ఎప్పుడో తెల్లవారుఝామున నిద్ర పట్టింది.

★ ★ ★

రెండోకూతురు చంటిపిల్లనెత్తుకుని అత్తగారింటికి వెళ్లాక పర్వతమ్మ మెల్లగా మైథిలిని పుట్టింటికి పంపించివేసింది.

అప్పారావు ఎప్పటిలాగే అమ్మ ఆజ్ఞ ప్రకారం ఆమెని దింపడానికి రామాపురం వెళ్లాడు.

"మళ్లీ మిమ్మల్ని చూడగలనో లేదో! బహుశా ఇదే మన ఆఖరి చూపు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. మీకు చల్లటి వస్తువులు పడవు జాగ్రత్త" అప్పారావు తిరుగు ప్రయాణమై వెళ్తున్నప్పుడు మైథిలి అంది.

మైథిలి పెద్ద పెద్ద కళ్లనిండా నీళ్ళు. మైథిలి వంక ఓసారి దీర్ఘంగా చూసి వెళ్లిపోయాడు అప్పారావు.

★ ★ ★

రెండునెలల తరువాత ఇంటి గుమ్మంలో నుంచున్న అప్పారావుని చూసి నిర్ఘాంతపోయింది మైథిలి.

"రండి...రండి. ఇంట్లో అందరూ కులాసాయేనా!"

బుల్లిరాయుడుగారు అల్లుడిని చూసి మహదానందపడిపోయారు.

'ఎందుకు వచ్చి ఉంటారు...బహుశా విడాకులు ఇస్తానని చెప్పడానికేమో? లేకపోతే రెండోపెళ్లి శుభలేఖ పట్టుకు వచ్చారా?' కాఫీ ఇస్తున్న మైథిలి మనస్సులో అన్నీ సందేహాలే.

"మామయ్యగారూ! నాకు హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. మా ఆవిడని తీసుకువెళ్దామని వచ్చాను. లీవు ఎక్కువలేదు. అందుకే ఈ రాత్రే వెళ్లిపోతాము" అప్పారావు బుల్లిరాయుడుగారితో అంటుంటే వింటున్న మైథిలి బుగ్గలు సిగ్గుతో నిగారించాయి.

సిగ్గుతో ఒప్పులకుప్పైపోతూ లోపలికి వెళ్లిపోతున్న మైథిలి అత్యద్భుతంగా కనిపించింది అప్పారావుకి. అందం చూసే కళ్లల్లో ఉంది. ఎంత నిజం! అప్పారావు మనస్సు సంతృప్తితో నిండిపోయింది.

తను ట్రాన్స్‌ఫర్ కావాలని చేయించుకున్నాడనీ, మైథిలితో కాపురం పెట్టాడనీ తెలిసిన రోజు పర్వతమ్మ ఎలా గంగవెర్రులెత్తిపోయి శివతాండవం చేస్తుందో ఊహిస్తున్న అప్పారావు పెదాలమీద చిరునవ్వు మొలుచుకొచ్చింది.

★



## టెన్షన్లకి దూరం

నవ్వు ఎంతటి టెన్షన్‌నైనా పారద్రోలుతుంది. ఇప్పుడు మల్లికా షెరావత్ కూడా నవ్వుకి ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. తనకు తెలిసిన జోక్స్‌ని ఫ్రెండ్స్‌కి ఎస్ఎంఎస్ చేస్తూ ఎంజాయ్ చేస్తోంది. జాకీచాన్‌తో ఆమె కలిసి నటించిన ది మిత్ గురించి మంచి టాక్ రావడంతో ఆమె జోక్స్‌తో కాలక్షేపం చేస్తోంది. అన్నట్టు ఈమె డ్రెస్ కోడ్ కూడా మారిపోయింది. వెస్ట్రన్ స్టయిల్‌లో సెక్సీగా కన్పిస్తున్న ఈభామని చూసి అంతా నవ్వుకుంటున్నారు. విదేశాలనుంచి వచ్చిన కొత్త కొత్త డ్రెస్‌లతో వార్డ్‌రోబ్ నిండిపోయిందట. ఎంత మార్పు?

